# తమ్ముడు

[ నాటిక ]

= శ్రీ రాయప్రోలు సీతారామాంజనేయశాస్త్రి =

## ఒకటో రంగము

(శారద పాడుతూ వుంటుంది.)

మాల్ కౌస్. జంపె.

ఆకాశవీథిలో అన్ని నక్షత్రాలు
పోరుపొక్క లేక కేరు శే—లీలా ?

౧. జాబిల్లి కిలకిలలు జాజులకు గిలిగింత
శుక్రుడీ కిరణాలు సూచికలు పాంథులకు...ఆకాశ.

౨. వెలుగునెడ చీకటికి వెటకారమేలా ?
చీకటన వెలుగునకు చిన్న చూపది ఏల?...ఆకాశ.

3. ఈర్ష్యాహంభావాలు ఎదనిడక నిజమరయ,
వెలుగుచీకటుల కౌగిలియె కాదా జగతి... ఆకాశ.

సుభద్రమ్మ—సుశికి కూడా చెప్ప వే, శారదా పాట.

ఇందుమతి— (లోపల్నుంచి) పాటలూ పద్యాలూ కూడానా నీ మొహానికి! యీ సత్రంలో పడున్నన్నాళ్లు ? ఇలా తగలడవే శారదా, తల పడిపోతోంది, కాస్త కుంపటన్నా రాజేద్దువుగాని. చస్తున్నా సరే అడ్డమైనవాళ్లనీ కూచోబెట్టి, యీ చాకిరీ చెయ్యక తప్పదల్లేవుంది.

సరస్వతి— అడ్డమైనవాళ్లనీ కూచోబెట్టి, యింటెడి చాకిరీ చేసే దొకళ్లూను, సూటీపోటీలు మరొకళ్లూను. పాచిమొహంతో లేచింది మొదలు నాకు ఒకటే మునగానాం తేలానాంగా వుంది, యిల్లు కడగనూ, కంచాలు కడగనూ ! ఓమూల గొల్లది అరుస్తున్నది అరుస్తున్నట్టుగానే వుంది—"పెరుగు పోయించుకు పాండమ్మగారూ" అంటూ. వినిపించుకోనే వినిపించుకోరు ఎవరూను. ఏదో శాస్త్రంచెప్పినట్టు, ఎవరికి పుట్టిన బిడ్డరా ఎక్కెక్కెడుస్తోందని ! ఒక్కత్తెనీ ఎందాకా విరగదొక్కుకోను ? పైగా కుంపటి రాజెయ్యలేదని రుసరుసలు !

ఇందు—ఎవతిమీదా రుసరుసలు చూపించలేదు తల్లీ ! నాకర్మం కాలితే నాబిడ్డని అనుకుంటానికూడా నోచుకోలేదేమిటి నేను ? నిన్న మధ్యాహ్నం నుంచి ఒచ్చిన తలనెప్పి ఒచ్చినట్టే ఏడిపిస్తుంటే చస్తానేమిటి ?...మళ్లా తయారుగా వుంచాలి వేళకి. ఒక్క కాఫో గడ్డలో అవుతే ఎదో తగలెయ్యొచ్చు. ఒకళ్లకి కాఫీ, ఇంకోళ్లకి ఓవల్ టిన్నూ; ఒకరికి టీ, మరొకరికి పాలూ, నాశ్రాద్ధమూనూ !

సరస్వ—ఉమ్మడిన పెట్టి అందర్నీ చుట్టబెట్టడం నాకేం బాగుల్లేదమ్మా. నేనూ అనలేక కాదు... ఊరుకున్న కొద్దీ రెచ్చిపోతోంది వ్యవహారం...

ఇందు—నీమాటేముందమ్మా దీంట్లో? ఇవతల వాళ్లే ఒట్టి నోరు పారేసుకునేవాళ్లూనూ, తనేమో మహా మాంధాత అయినట్టు !...ఏమే శారదా, చెవుల్లో చెట్లు మొలిచాయేమిటే, ఇందాకటినుంచీ గొంతు చించుకుంటుంటేను ?

శారద—ఏమిటమ్మా, ఒస్తుంటేనే !

సుభ—ఏమిట్రా యిందాకటినుంచి చూస్తున్నాను. ఓటే రామరావణాయుద్ధంగా వుంది ఎనిమిది జాములూను. పిల్లలు వచ్చే వేళయింది కూడా. కాస్త నోరాచుకు మాట్లాడరాదూ ?

ఇందు— ఏం ఏడుస్తున్నావే యిందాకటి నుంచీని?...పెద్దవాళ్లు చెప్పినట్టు వింటావా? (చెవులు

మెలేస్తుంది. శారద ఏడుస్తుంది) ఊఁ, చెప్పు...నా మాటంటే నీకూ గడ్డిపరకైందీ ?

సుభ—ఎందుకే లేతచేవులంపట్టుకొని మెలేశావు పసిగుడ్డుని? ఏమిటా అక్కసు ?

శారద—మామ్మోయి...

సర—ఎందుకమ్మా, ఒకళ్ల మీది కసి ఒకళ్ల మీద చూపుకోటం ?...ఇలా రా అమ్మా శారదా—

శార—ఇంకో మొమ్మోయి,......(ఏడుస్తుంది)

ఇందు—నాకేం చేతకాదమ్మా ఒకళ్లమీద కసి యింకోళ్ల మీద చూపుకోటాలు! మహా పత్తిత్తల్లే చెప్పొచ్చింది...శారదా, యిలా తగలడి కుంపటి రాజెయ్యి.

సుభ—నీకేం మతి పోయిందేమిటే ? పసి సన్నాసి అది నిప్పేం రాజేస్తుంది ? పరికిణీ అంటుకుంటే ?

ఇందు—పీడ విరగడైపోతుంది అందరికీని, ఫో... స్తంభంలా నుంచుంటావేం ? పిడకమీద కిరసనాయిలు పోసుకురా.

సుభ—పొద్దున్నే ఎందుకు తల్లీ అంతంత మాటలు ? వాడు వింటే బతకనిస్తాడా ? ఎంత అంకెళ్లు నొక్కుకున్నా నోరు బైటపారేయిస్తున్నావు కదా! నాకో ఒణుకురోగం పుట్టిందికాని లేకపోతే రోజుక్కి యాభైమందికి వారుద్దును...ఇంతకీ సరస్వతీ, దానికంత తలపడిపోతుంటే కాస్త నువ్వు కుంపటిరాజెయ్యరాదుటే ?...పెద్దదానివి, ఆమాత్రం సర్దుకుపోవద్దూ ?

సర—ఆ...నా పెద్దరికం బండలైనట్టే వుంది! ఎవరూ పెద్ద? తాటిచెట్టు పెద్ద. ఇంటెడిచాకిరీ ఒక్కచేతిమీద చేసేదాన్ని చేస్తూనేవున్నా ఓమూల. నేనుకూడా రింగురంగా అంటూ కాలిమీద కాలేసుకూర్చున్నట్టే కనిపిస్తున్నా మీకు. ఇంతకీ ఓ అమ్మ కన్న బిడ్డని నేనేగా పరాయిదాన్ని. మిగతావాళ్లంతా బీరకాయపీచే.

ఇందు—రింగురంగా అంటూ నే నేం కూర్చో లేదు.

సర—నిన్నెవరన్నారమ్మా, ... ఆవిడగారేమో అడిగితే నేనేమో చెబుతున్నా......

సుభ—ఎందుకే యింత రాద్ధాంతం ? అంట్లదగ్గిర్నుంచీ బుడ్లల్లో చమురుపొయ్యటందాకా పనిమనిషే చేసుకుపోతుందయ్యే. రెండుమెతుకులు ఉడకేసుకు తింటానికి యింత పొరుపులూ, పోట్లాటలూ... నాకేమీ బాగుండలేదు తల్లుల్లారా.

సర—గుర్రాన్నీ, గాడిదనీ ఏకంచేస్తారు...మీదగ్గిరుందిదే, ఊరుకునేవాళ్లు ఊరుకోక.

ఇందు—ఎంత పల్లెటూరిదాన్నయినా ఆమాత్రం తెలీకపోదు...మహా తనే చదువుకుందని!...ఇవతలవాళ్లు గాడిదలవుతే, తాము కుక్కలవుతారు, పందులవుతారు......

సుభ—అయ్యో, అయ్యో, ఇంటా వంటా లేని మాటలు ఎందుకే యిలా ? ఊరుకోండి, ఊరుకోండి... నలుగురూ వింటే నవ్విపోతారు.

పొరుగింటి లక్ష్మమ్మ — (గోడఅవతలనుంచి) ఏమిటి సుభద్రమ్మపిన్నీ, అబ్బాయిలు యింకా రాలేదేమిటి, కాలవనుంచి ? కోడళ్లేదో...(ఎకసక్కెంగా నవ్వుతుంది.)

సుభ—ఆ...ఏంలేదు లక్ష్మమ్మా, మనమరాళ్లేదో ఆటల్లో పోట్లాడుకుంటేను...ఒస్తున్నా (కోడళ్లతో మెల్లిగా)ఇహనన్నా ఊరుకోండే, లక్ష్మమ్మ వింటోంది గోడవతల్నుంచి. మూసినంతవరకేకాని గుప్పెడు తెరుస్తే ఏముంది !

లక్ష్మమ్మ— అబ్బే...ఏదో గుర్రాలూ, గాడిదలూ అని వినిపించినట్టుంటేను.

సుభ—ఆ...పిల్ల సన్నాసు లెక్కడో విన్నట్టున్నారు. సరే కాని, మరిచిపోయా లక్ష్మమ్మా, మీ అమ్మాయి జానకిజాడేమన్నా తెలిసిందా ? మరీ విడ్డూర్యంగా వుందమ్మా...బొంబాయి వెళ్లిందనీ, కలకత్తా అనీ...

లక్ష్మ—అబ్బే...ఏదో...లోకులు పలుగాకులన్నారు...అదుగో పాలు పొంగుతున్నాయి...ఒస్తా సుభద్రమ్మ పిన్నీ.

సుభ—అవునమ్మా, వెళ్లిరా...ఇంట్లో పని ముందు చక్కబెట్టుకోవాలి. ఇంతకీ కర్మ. పసితనంలో పెనిమిటి పోవటం, అదీ. (దూరంగా వెళ్లి శారదా, సుశీలా యిందాకటిపాటే పాడుతూవుంటారు.)

"ఈర్ష్యాహంభావాలు, ఎదనిడక నిజమరయ,
వెలుగు చీకటుల కౌగిలియెగాదా జగతి...
ఆకాశవీథిలో."

రెండోరంగం

(ఇందుమతి శారదకు జడవేస్తూవుంటుంది)

ఇందు—తల కదల్చకు, పాపిడి వంకరవుతే బతుకంతా వంకరంటారు.

శార—అబ్బ, ఎంతసేపే? జడ నెప్పెడుతుంటేను...

ఇందు—ఎందుకా తొందర? ఏంపాతేసుకున్నావేమిటి అక్కడ? అదుగో మళ్లా కదిలావు... చిక్కన్నా తియ్యనిస్తావా, నెత్తిన మొట్టమన్నావా?

శార—అయితే నాకొద్దమ్మా, పాడు జడ. ఇంకోమ్మయితే అంచక్కగా వేస్తుంది. ఏమీ నెప్పెట్టదు. నన్నొదులు, నే నెల్లిపోతా...

ఇందు—నేనేం విషం పోశానే నీకు? ఆవిడంటే పడిచస్తావు? (మొట్టుతుంది.)

శార—(ఏడుస్తుంది) నే నేయించుకోనే. మామ్మోయి, చూడు, అమ్మ కొడుతోంది.

ఇందు—మామ్మా! యింకోమ్మా!...నీ బొంద పెట్టా, వాళ్లదగ్గిరికెళ్లీ మాటు, ఒళ్లుచీలుస్తా.

సుందరం—(ప్రవేశించి) ఏమిటే? ...యజ్ఞం చేస్తున్నావు?

శార—నాన్నోయి...అమ్మే...జుట్టు పీకి మొట్టుతోంది.

సుంద—అదేం రోగమే? దాన్నలా ఏడిపించి జడెయ్యకపోతే ఏం?

ఇందు—మూడురోజుల్నించీ చింపిరిదయ్యమల్లే వుంటే కాస్త జడేద్దామని కూర్చోబెట్టానండీ, బంయ్ మంది రాక్షసల్లే...

సుంద—మూడురోజుల్నించీ వెయ్యకపోవడమేం?

శార—ఇంకోమ్మేసింది నాన్నా నిన్న, సుశికీ నాకూను...

ఇందు—నేనేం చచ్చాననుకున్నారా? అవునండీ, పరాయివాళ్లు నా పిల్లకి జడెయ్యడమెందుకు? పైగా యీ చాకిరీ చేశానూ, ఆ చాకిరీ చేశానూ అని నన్ను దెప్పడమూను!

సుభ—(ప్రవేశించి) అలా అంటావనే కాదుటే మొన్న సుశికి తలంటిపోసి శారద ఎంత ఏడ్చినా పొయ్యకుండా వూరుకుంది పాపం సరస్వతి? అందుకూ తెగసాది స్తివి 'కాస్త పిల్లకూ డా తలరుద్దితే చేతులేం అరిగిపోతాయా' అని!

సుంద—పెద్దామె నలా వెనకేసుకొస్తావేమిటమ్మా నీ కెన్నిమాట్లు చెప్పినా?

ఇందు—ఇదీ వరస యింట్లో నా బతుకు! కాకిని పొడిచినట్లు పొడుస్తారు; అయిందానికీ కానిదానికీని. మొన్నమటుకు మొన్న దాసీముండ అంటుంది నాతో "మీకూ చిన్నయ్యగారికీ పనేముందీ?" అని. ఇంటిల్లిపాదీ వింటూవూరుకున్నారు...ఇంతకన్నా చస్తే నయం.

సుభ—నేను లేనుటే! దాసీది వాడిమాటేమన్నా అందీ? ఊహూ, సాదిస్తుంటే, ఆముండ నిన్నన్నమాట నిజమే...నేనూ, సరస్వతీ దాన్ని చివాట్లెయ్యలేదూ?

ఇందు—నన్నంటే ఓటేనీ, ఆయన్నంటే ఓటేనా? ఓడు ఓడంటే కంచమంతా ఓడని...మొన్నీమధ్య వాళ్ల మాణిక్యాంబగారింటికి పేరంటానికెళితే, నలుగురిలో మొహాన పట్టుకు అడుగుతుందీ విశాలమ్మ..."పెద్దా చిన్నా లేకుండా యింట్లో తిడుతావుటగా?" అని. ఇద్దరూ ఒకటై, నానా హింసలూ పెడుతుంటే కుక్కిన పేనల్లే పడున్నాను. పైగా ఊరంతా యిదో చాటింపా నేనో బ్రహ్మరాక్షసినని?...నే నుండలేను బాబూ యీ నరకకూపంలో.

సుభ—ఎందుకే అన్ని ఆగాయిత్యాలు? ఆ పర మాత్ముడికి తెలీదూ నిజానిజాలు? వాడికొక్కడా నూరి పొయ్యటం దేనికీ?

ఇందు—చూశారా? చూశారా? మీ ఎదటే? మీ రేంచేతకానివాళ్లూనూ, నేను నూరిపోసేదాన్నీని!

సుంద—ఛుప్...ముయ్యి నోరు...కల్లుపాకైంది యిల్లంతాను...నోరెత్తితే తంతా...

సుభ—ఊరుకోరా నాయనా! చిన్నప్పటి నుంచీ ఓశే దుడుకు నువ్వు.

ఇందు—కొట్టండి, అందరి కళ్లూ చల్లగా వుంటాయి! (ఏడుస్తుంది)

## మూడో రంగం

(ప్రసాదరావూ, సుందరం మాట్లాడుకుంటూవుంటారు)

ప్రసా—అలా యిల్లు పట్టించుకోకుండా వుంటే కష్టంరా తమ్ముడూ, నీ నడతేం బాగుండటంలేదు.

సుంద—అయితే ఏమంటావయ్యా? నడతేం బాగుండటం లేదుట! నడత, అందరినడతలూ బాగుండేడిసినట్టు!

ప్రసా—అంత పెడసరంగా మాట్లాడుతావేమిటి? ఏదో మంచీ చెడ్డా చెబుతుంటేను?

సుంద—పెడసరం ఏముంది? చేతులు నలుపుకుంటూ కూర్చోవాలా ఏం?

ప్రసా—ఆమాటెవరన్నార్రా? ఊరికే చిన్నప్పటినుంచీ కూర్చోపెట్టి, చేసుకుపోతుంటేను?...

సుంద—ఎవడు చెయ్యమన్నాడోయి? మహా దెప్పుతావు! ఎవరూ ఎవరికీ ఏమీ ఉచితార్థం చెయ్యరు. నాలుగురాళ్లు సంపాదిస్తేనే మహా ప్రయోజకుడైనట్టు! ...నేను కనిపెడుతూనే ఉన్నాలే, వీడో చవటదద్దమ్మనీ, అగస్త్యభ్రాతనీ నీ ఉద్దేశం. ఇంట్లోకూడా అలాగే ఏడుస్తోందిలే...

ప్రసా—ఎందుకంత కష్టంగా మాట్లాడుతావు? నీ మంచికోసమేనా, నా ఒళ్లో ఒరిగేదేమన్నా వుందా?

సుంద—మహా బైల్దేరారు లేద్దూ, లోకోపకారార్థం, అన్నలూ మేనమామలూనూ!

ప్రసా—అలా వ్యంగ్యంగా మాట్లాడుతావేమిటి?...కొత్తగా వుందే ధోరణి!

సుంద—అవునవును! చచ్చినట్టు చెప్పుకింద తేలల్లే పడివున్నంతకాలం 'అమాయకుడండీ, బోళావాడు మా తమ్ముడు' అనడం, కాస్త సబబుగా మాట్లాడితే, కొత్తగా వుంటుంది ధోరణి: తుంటరివాడవుతాడు...వ్యంగ్యాలూ లేవు, ధ్వనులూ లేవు. నా కేం కవిత్వం చేతకాదు...ఆడవాళ్లకి నేర్పటానికి!

ప్రసా—నీ ప్రతిమాటా నన్నెందుకో గాయపరుస్తోం దివాళ.

సుంద—నీ ప్రతిచేతా నన్నెంత గాయపరిచిందో నువ్వు గుర్తించటం లేదు.

ప్రసా—(గంభీరంగా) అవుతే నేను నీకు ద్రోహం చేశానన్నమాట?

సుంద—(మౌనం)

సుభద్రమ్మ—(ప్రవేశించి) భోజనానికి లేవండ్రా.

ప్రసా—అంతేనా? మాట్లాడవేం? నాన్న పోయినప్పటినుంచీ ఆడిందాటగా పాడింది పాటగా, నాటకాలంటే నాటకాలూ, సినిమాలంటే సినిమాలూ, సిల్కుచొక్కాలూ, పట్టంచుధోవతులూ, పెళ్లీ, పేరంటం ఇన్నీ ఎలా జరిపానో,—ఏం జరిపానో, దానికి ప్రతిఫలం యిదా? పైగా ఎవరికీ ఎవరూ ఏమీ ఉచితార్థం చెయ్యరని సూత్రీకరిస్తావూ?...నిజమే, నాలోని ఏ స్వార్థచింత అదృశ్యంగా పనిచేసిందో యిన్నాళ్లూ, నాకే తెలీకుండా!

సుంద—అది కాదన్నయ్యా, నేననేది...

ప్రసా—నువ్వు దాయొద్దు సుందరం, నాకు తెలిసిపోయిందిగా నీ ఉద్దేశం! నాది కొందరు తెలివితక్కువన్నారు; కొందరు అతి తెలివన్నారు. ఒకరు లోభి అన్నారు నన్ను; ఇంకోరు ఉదారుడన్నారు. కాని 'ద్రోహి' అని నా తోడబుట్టినవాడే యీ రోజు

అన్నాడు...చాలు నా జీవితానికీ బిరుదు! చిన్నవాడివి నీకు నమస్కారం చెయ్యరాదుగాని, నీ కోసం అని నేననుకుని చెప్పిన మాటలూ, చేసిన చేతలూ నా కోసమేనని నువ్వు నాకు గుండెల్లో గుచ్చుకుపోయేట్టు చెప్పగలిగావు. కృతజ్ఞుణ్ని!

సుభద్రమ్మ—ఇవాళ పొద్దున్నే ఎవరి మొహం చూశాన్రా? భోజనాలన్నా కాలేదు, మీరు మొదలెట్టారు! పెద్దబ్బాయీ...అన్నగారివి...తండ్రితో సమానమన్నారు. సద్దుకుపోవద్దూ నాయనా?

ప్రసా—తండ్రి కొడుక్కి ద్రోహం చేస్తాడుటమ్మా?

సుభ—ఎందుకురా అలాంటి పెద్ద పెద్ద మాటలు? వాడి సంగతి నీకు తెలీదుట్రా, ఒట్టి తాటాకుమంట అని? ఏమిట్రా సుందరం?

సుంద—నేనలా అనలేదమ్మా.

ప్రసా—బొట్టూ కాటికా పెట్టి అనాలిట్రా అబ్బాయీ? ఇంతవరకూ నేను వాడికెంతో ద్రోహం చేశానుటమ్మా! ఒట్టి నాకరుగా చూస్తున్నానుట. చూస్తున్నారుట యింట్లో కూడాను!

సుభ—అలా ఎప్పుడూ అనడు, ఒట్టి అభాంద్రాయి...ఎప్పుడు పోతుందిరా సుందరం, నీ నోటివట్టం?

ప్రసా—నేనూ అలాగే అనుకున్నా. ఒకల్లిద్దరి దగ్గిర వీడిలా అన్నట్టు చూచాయగా తెలిసినా కూడా ...ఇప్పుడు తేలిపోయిందిగా, నా మొహానే అనేశాడు!

సుంద—అవునమ్మా, యింట్లో సంగతి నీకు తెలీందికాదు. పొద్దునమటుకు పొద్దున కాఫీ కాయటాని కంతరభసా? మొన్న పిల్లకి తలంటిపొయ్యటాని కంత రాద్ధాంతమా? ఇవన్నీ మొగాళ్లు కలిపించుకోవాల్సినవి కావుగాని...

ప్రసా—ఏమిటమ్మా యివి? ఆశ్చర్యంగా వుందే! నా చెవిని పడటమే లేదు!!

సుభ—ఆఁ, వాడి చెవినిమాత్రం పడాల్సిన విట్రా? అది చెప్పింది, తంపులమారి మనిషి.

సుంద—అదుగో అదే ఒద్దంది. దాని సంగతేముంది యిప్పుడు?

సుభ—ఛీ, ఏవో ఆడవాళ్లూ ఆడవాళ్లూ సద్దుకు పోయేవి నీదాకా రప్పించడం దేనికిరా, పాడుబుద్ధులు కాకపోతే? పెద్ద దెప్పుడన్నా యిలాంటి దెరిగుందీ?

సుంద—అసలు నీతోనే ఒచ్చింది, పెద్దామెని వెనకేసుకురావటం. మేనకోడలూ, అత్తా ఒకటనే పేరు తప్పితే, నీకూ చిన్నకోడలికీ ఒకనాడుమటుకు పడేడిసిందీ?

ప్రసా—చాలా గ్రంథం వుందే? నేనిన్నాళ్లూ కళ్లుమూసుక్కూర్చున్నా నన్నమాట!

సుభ—గ్రంథంలేదు, ఏం లేదు, ఊరుకోరా సుందరం...ఏమిటీ యిలా పుట్టింది నీకు యివాళ?

సుంద—ఇన్నాళ్లూ ఊరుకోబట్టే యీలా తగలడింది. నయం, ఉరోసుకోమన్నావుకాదు!

ప్రసా—అయితే నీ ఉద్దేశం ఏమిటి?

సుంద—ఉద్దేశమేమిటి గిద్దేశం?

ప్రసా—గుండెలమీద చెయ్యేసుకు చెప్పు, నిజంగా నీకు బాధ కలిగేట్టే ప్రవర్తిస్తున్నానా నేను?

సుంద—నిస్సందేహంగా...ఆడవాళ్లు మరీని...

సుభద్ర—ఆడవాళ్లమా టెందుకురా?

సుంద—నువ్వూరుకోవమ్మా! నే నీ యింట్లో వుండదలుచుకోలేదు.

ప్రసా—నిన్నెవరూ పట్టివుంచలేదు.

సుంద—ఉంచుతేమటుకు వుండే దెవరు? ఉద్ధరించావు యింతకాలం చాలు!

ప్రసా—ఇహ నీ మొహం చూడక్కర్లేదు.

సుభ—పెద్దాడా, నువ్వుకూడా తొందరపడుతున్నావేమిట్రా? ఇహ పనికొస్తాడూ వాడు?

సుంద—మరేం ప్రమాదం లేదు.

(వెళ్లిపోతాడు సుందరం)

(దూరంగా శారదపాట వినిపిస్తుంది)

"వెలుగునెడ చీకటికి వెటకారమేలా?
చీకటన వెలుగునకు చిన్నచూపది ఏల?
ఈర్ష్యాహంభావాలు ఎదనిడక నిజమరయ
వెలుగుచీకటుల కౌగిలియె కాదా జగతి? ఆకాశ॥

## నాలుగో రంగం

(సుందరం బాగా తాగిఒస్తాడు)

సుంద—ఏయ్, కాసులపే రదే? డొక్క చీరేస్తా, చెప్పు ముందు, నా యిల్లు నా యిష్టం. మాలాడి కమ్ముకుంటా మాదిగాడికి ధారపోస్తా, ఓ వెధవ చెప్పేదేమిటి?

ఇందు—చంద్రహారం తీసుకు పోయారు చాలదూ, ఎవరికీ తెలీకుండా? మీరు కాసేపు పడుకోండి. ఒళ్లు సరిగ్గా లేదల్లేవుంది.

సుంద—గాడిదే, నేనేం తాగొచ్చా ననుకున్నావులే?...ఆ మాటకొస్తే యిప్పుడు తాగుతా... యిదుగో 'బాటిలు'...నాకు నీతులు నేర్పుతారులే దమ్మిడీకి కొరగానివాళ్లంతా? ఇదుగో తాగుతున్నా...ఏ సన్నాసి అడ్డం ఒస్తాడో చూస్తా!...

ఇందు—ఎంతపాపం చేసుకున్నానండీ, చేతులారా? నారాయణ,...

సుంద—శారదేదీ? వాడింటికి పంపావు? ఆ గాడిదగుమ్మం తొక్కొద్దన్నానా?...కాసులపే రేదే ఇంతకీ?

ఇందు—శివశివా, పగవాడికైనా ఒద్దు బాబూ! బావగారిని కూడా ఎందుకండీ?

సుంద—నోరు ముయ్యి, ఆ వెధవని వెనకేసుకొస్తావు? మాల అప్పిగాడికి అమ్మేశాలే, యింట్లో నాభాగం! నా కాళ్లమీద పడకపోతే చూడు!... మళ్లా ఉపన్యాసాలిస్తాడు మహా...ఆడంగులికి సంగీతాలు నేర్పి కవిత్వాలు కట్టడం కాదు. జానకితో సరసాలాడటం అనుకున్నాడు కామాలు!

ఇందు—ఎందుకండీ, పాపాలు ఊరికే మెడకి చుట్టుకోటం? కామెర్ల కంటికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందిట!

సుంద—ఊఁ? యిందాకటి నించీ చూస్తున్నా, ఆ దౌర్భాగ్యుణ్ని నెత్తిన పెట్టుకోటంతోనే సరిపోతోంది. నేను దొంగనా? తాగుబోతునా? వ్యభిచారినా? వాళ్లు నెత్తిమీది దేవతలా? కలిసి ఉన్నన్నాళ్లూ కాల్చుకు తిన్నావూ? వేరే కాపరం పెడితే వెళ్లి వాళ్లల్లో దూరావూ? నీ మొహం మండ...

ఇందు—ఏదో పోట్లాటల్లో అనేకం అనుకున్నా. 'చస్తే బాగుండు'నన్నా...చంపక పోయారూ? 'వేరే వుంటే బాగుండు' నని అన్నమాట నిజమే. అంతమాత్రంచేత తుట్టె నా మీద వెయ్యడ మెందుకు?

సుంద—అయితే...నన్ను గాడిదను చేశారులే మీరంతా కలిసి? అప్పుడు కాకపోతే యిప్పుడు చావు...అదుగో శారద,...ఒచ్చావూ? నీ శ్రాద్ధం పెట్టా, అంతా ఏకమై నాతల కొట్టి మొలేస్తారులే... (మళ్లా తాగి) ఆ, ఇవ్వాళ్ల నెత్తురు కళ్లజూడాలి!... ఈ బాటిలు కూడా తాగేశా...ముందుచెప్పు, కాసుల పేరేం చేశావు? ఏం శారదా, నువ్వు తీసుకెళ్లావా? కాసులపేరు? నరికేస్తా చెప్పకపోతే...(కొడతాడు).

శారద—మామ్మ కిచ్చిరమ్మంది నాన్నా... కొట్టకు... అమ్మో!...

సుంద—ఆఁ? మామ్మ కిచ్చిరమ్మందా, ఆగాడిదకా? వాడి మీద నీకు...?(కొడతాడు) డొక్క చీరేస్తా.

ఇందు—బాబోయ్...చచ్చా.

శారద—అమ్మో, అమ్మో, కొట్టకునాన్నా.

పొరుగిళ్లవాళ్లూ, సుభద్రమ్మ—అయ్యో' అయ్యో, ఏమిటీ ఘోరం? చంపేస్తావేమిటి?

సుంద—పోండి అవతలికి, మీ కెందుకు? నా పెళ్లాన్ని కొట్టుకుంటా, కోసుకుంటా... ఆసి ముసలి పీనుగా, నువ్వూ ఒచ్చావులే? నా కాసులపే రెత్తికెళ్లి ఆ వెధవకి కట్టబెడుతావా? మొదటి నుంచీ నేను శత్రువునేలే నీకు? చావు. (కొట్టబోతాడు.)

పొరుగింటి రామారావు—ఆఁ,ఆఁ!వూరుకోండి సుందరంగారూ.

సుభ—ఎలాంటివాడివి ఎలా అయిపోయావురా. కాసుల పే రొక్కటేగా మిగిలిందని

దాయించా. నేను పాలు పోసినా విషంగానే కనిపిస్తోంది నీకు. కొట్టు నాయనా, చంపు, యీదుఃఖం చూడలేను.

పొరుగింటి సుబ్బయ్య— చాలు చాల్లేవయ్యా, ఊరనుకున్నావా, అడివనుకున్నావా? నీచేష్టలూ నువ్వూ! తల్లిమీద చెయ్యెత్తుతావుటయ్యా?...యిహ మర్యాద దక్కదు.

వెంకట్రామయ్య—ఎలాంటి వంశమయ్యా, తులసి వనంలో గంజాయి మొలిచినట్టు...తప్పబుట్టావు. పరువూ, మర్యాదా అక్కర్లేదూ? ఎంత చెడినా?తప్ప తాగి తల్లిని పట్టుకుకొట్టబోతున్నావు, సిగ్గులేదూ?

సుంద—(విరక్తితో) ఛీ, యీ పాడు జీవాలు!...నేనేనా దుష్టుణ్ని ఇందర్లోకీ? ఉండండి మీరూ మీరూ అంతానూ. నే నిదే వెళ్లిపోతున్నా...

సుభ—అబ్బాయీ, పోకు.

సుంద—నీకు ఒక్కడే కొడుకు.

ఇందు—అమ్మో, ఏ మండోయి, పారబాటైంది.

సుంద—ఛీ, నీకూ నాకూ సంబంధం లేదు.

శారద—నాన్నా, నాన్నా.

సుంద—మీ నాన్న చచ్చాడు. (వెళ్లి పోతాడు)

## ఐదో రంగం

(బొంబాయిలో సుందరం తన స్నేహితుడు డాక్టరు ప్రకాశంతో మాట్లాడుతూ వుంటాడు)

సుంద—కాయా, పండా, ప్రకాశం?

ప్రకా—దోరకాయ.

సుంద—కవిత్వం మానెయ్యి. దోరకాయం టే?

ప్రకా—ఇరవై వేలు ముందు ఆమెపేర బ్యాంకులో వెయ్యాలిటోయి.

సుంద—ఓ, లెక్కేమిటి? ఒక్క డర్బీస్వీప్‌లో ఒస్తాయి ఇరవై వేలు. వేసి?

ప్రకా—నెలకి వెయ్యిచొప్పున యిస్తూవుండాలిట.

సుంద—ఇస్తూవుం టే?

ప్రకా—ఇతరులతోపాటు నిన్నూ రానిస్తుంది.

సుంద—అప్పుడైనా నన్నే ప్రేమించదన్న మాట!

ప్రకా—అది ప్రేమకాదోయి, పాపపు మెరుగు.

సుంద—కాని ఆపాపాని కంత తళతళా, ఆకర్షణా ఎందుకోయి? ఆరోజు 'డాన్సు'లో ఆమె అంగాల ప్రతికదలికా నా అణువణువునీ ఉద్రేకపరిచిందోయి. పాపపుతలపుకే అంత సుఖానుభూతి కలిగినప్పుడు, పాపమే చేస్తే స్వర్గానందం పొందమూ?

ప్రకా—అమృతం ఉద్రేకపరచదు భాయీ! నువ్వనుభవించింది సుఖాభాసమాత్రమేనోయి. పాప ద్వారం స్వర్గధామానికి తీసుకుపోతుందా?

సుంద—అయితే వెధవది నాకు స్వర్గమే అక్కర్లేదు.

ప్రకా—దానికైనా అంత వెల నేను సహించను సుందరం.

సుంద—వెలలుకట్టడం అనుభవించేవాళ్ల పని కాదు.

ప్రకా—మాధురి కడుతోందేం మరి?

సుంద—ఆనందం అనుభవించేది ఆమె కాదు.

ప్రకా—అదేమిటి? ఎవరు మరి?

సుంద—శ్రోతల్ని దివ్యధామాల్లోకి తీసుకుపోయే గానం, ద్రష్టల్ని ఆనందడోలికల్లో ఊగించే గులాబీ, పాయకుల్ని అవ్యక్తసుఖసీమల్లో విహరింపజేసే మద్యమూ స్వయంగా ఆనందం పొందుతాయా?

ప్రకా—తర్కానికి నా తలలో తావులేదు. నరకానికి తీసుకుపోయే స్వర్గపథం చూపిస్తావు నువ్వు.

సుంద—స్వర్గపథగామి తన పయనంలో పొందే సుఖం చాలదూ? చివరికి చేరేది నరకమయితేమటుకేం?

ప్రకా—గమ్యస్థానం నరకమని తెలిస్తే పయనంలోకూడా పథికుడికి సుఖం ఉండదు.

సుంద—కాని, నరకమేచేరుతాడని నిర్ధారణేదీ?

ప్రకా—అనుమానప్రమాణంమాత్రం వుంది.

సుంద—అదీ లేదోయి నిజానికి. అశక్తులు కల్పించిన ఒక భ్రాంతి నరకం. కాదంబరీ, కామినీ

యిచ్చే సౌఖ్యం వరకానికి దారులుతీస్తే, ఉపవాసాలూ, ఇంద్రియనిగ్రహాలూ స్వర్గానికి నిచ్చెనలేస్తాయిటోయి, వెఱ్ఱివాడవుగాని!

ప్రకా—నీతో వాదం దేనికి బాబూ. నా ఉద్దేశంమటుకు స్వర్గమైనప్పటికీ నెలకి వెయ్యిరూపాయలా?

సుంద—నెలకి కాదు రోజుకు వెయ్యి అయినా సరే. కాని,...కాని,...సరేలే.

ప్రకా—ఏమిటీ కాన్లూ, అర్థణాలూనూ! ఇతరులతోపాటు నిన్నూ రానివ్వటంసంగతి ఆలోచిస్తున్నా వేమిటి?

సుంద—మరే...కాని, నా దేపొరబాటు. గులాబీ ఒక్కరికిమాత్రమే సౌరభాన్నిస్తుందా?

ప్రకా—నీ ప్రతిభ అసమానం.

సుంద—సరే అయితే, పద. ఒరేయి మున్నా, కారు తయారుగా వుంచమను డ్రైవరుతో.

మున్నా—చిత్తం...

ఆ రో ర ం గ ం

(మాధురి పాడుతూవుంటుంది)

సుంద—(ప్రవేశించి) హలో మిస్ మాధురి!

మాధురి—(ఆశ్చర్యంగా) ఒచ్చారే మీరు! (ప్రశ్నార్థకంగా) ఒచ్చారూ? (నిస్పృహతో) ఒచ్చారు...

సుంద—(తడబాటుగా)ఏం? ఊ,క్షమించాలి. నీ వరతులికి అంగీకారమేనని ముందుగానే 'ఫోను' చేద్దామంటే మా ప్రకాశం 'ఒద్దు, స్వయంగానేవెళ్లి చెబుదా'మన్నాడు... వరతులికి యిష్టం కాకపోయినా ఒచ్చేటంత మూర్ఖుడు కాదు సుందరం.

ప్రకా— అవును. అన్నింటికీ ఒప్పుకునే వచ్చాడు.

సుంద—ఎందు కలా దీనత జెందుతోంది నీ ముఖారవిందం? ఏదీ ఒక్కమాటు మళ్లా ఆపాట?

మాధు—ఆ. (అంగీకారసూచకంగా)

సుంద—ఒక్క మధుర భంగిమం?

మాధు— ఆ. (అర్ధాంగీకారసూచకంగా)

సుంద—ఒక్క మృదుహాసరేఖ?

మాధు—(నిట్టూర్చి) ఊ. (తప్పనిసరైనట్టు)

సుంద—ఒక్క చుంబనం?

మాధు—ఊ? (ప్రశ్నార్థకంగా)

సుంద—ఒక్క గాఢపరిష్వంగం?

మాధు— ఉహూ. (అసమ్మతిసూచకంగా) ప్రకాశంగారూ, మీరు వెళ్లవద్దు.

సుంద—నేనెంత తాగినా, ఒళ్లు తెలీక... ప్రకాశం యిక్కడుండడు.

మాధు—కాని, నేను వేశ్యని.

సుంద—ఆసంగతి ప్రపంచానికంతా తెలుసు.

మాధు—అయినా నీచురాల్ని కాలేదు. కాలేను.

సుంద—నేనెన్నడూ అలా నిందించలేదు మాధురీ నిన్ను. ఏదీ నీ అధరమధురా...

మాధు—ఊహూం.

సుంద—నన్నవమానిస్తున్నావా మాధురీ?

మాధు—లేదు ప్రభూ, మీమీది ప్రేమేనన్ని ద్రోహం చెయ్యనియ్యటం లేదు.

సుంద—అయితే ప్రేమించడమే మాను...మరి ఆవరతు లెందుకు, ఆ రాయబారా లెందుకు?

మాధు—ఎలాగైనా మిమ్మల్ని విముఖుల్ని చేద్దామని.

సుంద—ఆశ్చర్యంగా వుందే, ఈ జాతిలో యీ మాటలు! నా ధనాన్నీ, యవ్వనాన్నీ న్యూనపరుస్తున్నావు మాధురీ, తెలిసో తెలీకో!

మాధు—తెలీక మీకు స్వాగతమిచ్చాను మొదట్లో, మన్నించండి.

సుంద—ఇప్పుడు తెలిసిందా నీచుడినని?

మాధు—అమ్మ, ఎంతమాట! వారి తమ్ములు అలాంటివారు కాలేరు.

సుంద—(విభ్రమంతో) ఏమిటి? ఎవరిమాట?

మాధు—దాచలేను.(గంభీరంగా) అవును, మీరు ప్రసాదరావుగారి సోదరులు.

సుంద—(దిగ్భ్రిమజెంది) నీ కెలా తెలిసింది? వాడి నెరుగున్నావా?

మాధు—నేను వారి శిష్య పరమాణువుని, జానకిని.

సుంద—(మరింత ఆశ్చర్యంతో) జానకివా? మాధురివి కాదూ?

మాధు—ఇక్కడికొచ్చి పేరు మార్చుకున్నా.

సుంద—వాడు నిన్నుఉంచుకున్నాడని పుకారు పుట్టింతర్వాత లేచివచ్చింది యిక్కడికేనా?

మాధు—శివశివా, నాలిక చీలిపోతుంది అలా అన్నవాళ్లకి. ఆయన పరమయోగులు. నేను తిరస్కృతను...

సుంద—ఎంత మధురస్మృతి? మన పూర్వపరిచయం నన్ను మరింత ఉద్రేకపరుస్తోంది. ఆలస్యం చెయ్యకు...

మాధు—క్షమించండి. మీరు నాకు పుత్రసములు. నా అంతరాత్మ బాధిస్తోంది. పైగా వారి ఆజ్ఞ...

సుంద—వారెవరు?

మాధు—మీ సోదరులు.

సుంధ—ఛీ, పరమదౌర్భాగ్యుడు వాడిమాటెత్తుతావు, ఆ వెధవ ఎవడు ఆజ్ఞపెట్టడానికి? అప్పుడే అసూయపుట్టిందీ మంచిదశలో వున్నానని? మళ్లీ ఉపన్యాసాలిస్తాడు!

మాధు—వారిని పరుషవాక్యం అనడం యీ పాపిచెవులు భరించలేవు.

సుంద—వాడిమీది నీ గౌరవం నాకు మరింత క్రోధాన్ని కలిగిస్తోంది. నీయెడల నీతిగా ప్రవర్తించీ, నా యెడల నీచంగా వర్తించీ, మనిద్దరికీ మేలే చేశాడు. ఈ శరద్రాత్రి, మనిద్దరం వాడికి ఈర్ష్యాశిగ్నులు లేపుదాం. రా...

మాధు—భరించలేను. తాకారా మీ రెరగరు నాసంగతి!

సుంద—పిచ్చిదానా, నాసంగతీ నీకు తెలీదు. ప్రాణాలు బలిస్తాడు, అవసరంవస్తే, తీసుకుంటాడు సుందరం! విలంబం సహించలేను...జాగ్రత్తగా ఆలోచించుకో.

మాధు— దౌర్జన్యంతో ప్రేమ కొనుక్కుంటారా?

సుంద — కసితీర్చుకుంటా. కోరిక తీర్చుకుంటా. ఓ అప్రయోజకుడు, ఓ సోదరద్రోహి, ఓ వంచకుడు, ఓ విషయ లాలసుడు, ఓ పరమలోభి నా ఆనందమయ జీవితానికి అడ్డం ఒస్తాడా? ఆ శుంఠ చెప్పాడని ఓబోగంది నన్నవమానిస్తుందా? తమ్ముణ్ని యింట్లోంచీ, ఊళ్లోంచీ వెళ్లగొట్టి...

మాధు—ఆ, చాలు. మీకు కీడు తలబెట్టలేను. వారి ఆజ్ఞ...

సుంద—నీమృదూక్తులు నాఉద్వేగానికి జోలలు పాడుతూంటే ఆ తుచ్ఛుడి ఆజ్ఞ నారోషాగ్నికి ఆజ్యం పోస్తోంది.

మాధు— వారి తమ్ములు గనకనే యీ మాత్రం దూషణవాక్యాలు సహించగలిగాను. యిహ అసంభవం.

సుంద—(వికటంగా నవ్వి) ఏం? తలకొట్టి మొలేసేదానివా యింకోళ్లవుతే? నాకు నీతులు చెబుతూందా ఓ బహుభర్తృక, ఓ పణ్యాంగన? చూస్తా ఏ మొగాడడ్డు ఒస్తాడో! (మీద పడబోతాడు)

మాధు—చెయ్యివేశారా ప్రాణాలు దక్కవు.

సుంద—(మండిపడి) ఆ! ఎవరి ప్రాణాలు దక్కవో చూద్దాం. (రివాల్వరు చూపిస్తూ) ఇదుగో రివాల్వరు. యిహ మాట్లాడకు. నన్ను పశువుని చేసే శావు ఆ నీచుడి పేరెత్తి. (యింకా దగ్గరి కెళుతాడు)

మాధు— (నిర్లక్ష్యంగా నవ్వి) రివాల్వరు నన్నేంచెయ్యలేదు. తన కిష్టం లేని పురుషుడితో ఆనందించే ఆత్మహీనురాలు కాదు మాధురి. చూస్తాను!

సుంద—ఆ, పాదతాడనమే!

ప్రసాదరావు— (అకస్మాత్తుగా ప్రవేశించి) తమ్ముడూ! సుందరం, నువ్వే? యిక్కడున్నావా? జానకేదీ? ఎవరు యీమె? ఏమిటిదీ?

సుంద—(వెనక్కి తిరిగి) నామొహం చూడకక్లేదన్నగాడివి నువ్వట్రా యిక్కడ? నీ బోడి ఆజ్ఞా? ఇదేరా నీ జానకి! ఈ కుట్రంతా నీదే. ఈ రివాల్వరుకు గురి అవాల్సింది నువ్వురా ద్రోహీ...(అని

పేల్చి పారిపోతాడు. ప్రసాదరావు 'హా' అని పడిపోతాడు.)

మాధు—మీరా? అయ్యో! (మూర్ఛపోతుంది.)

ఏ డో రం గం

(డాక్టరు ప్రకాశం, ప్రసాదరావూ మాట్లాడుకుంటూ వుంటారు)

ప్రకా—కట్టు రేపుగాని ఊడదియ్యటానికి వీల్లేదు.

ప్రసా—మా తమ్ముడి స్నేహితులైనందుకు నాకు చాలా సాయం చేశారు. కృతజ్ఞుడిని ప్రకాశంగారూ...

ప్రకా—ఆ, ... దానికేం లెండి ... నిజానికి మీరు సుందరంఅన్నగారని మొదట్లో నే నెంతమాత్రం అనుకోలేదు. అతని హృదయం నవనీతంలాంటిది... కాని చూసేవాళ్లకిమటుకు ఒట్టి దుర్మార్గుడల్లే కనిపిస్తాడు...

ప్రసా—నాకు తెలుసు...వాడి హృదయాన్ని కలతబెట్టింది నా పలుకులే. నాలో అవ్యక్తంగా సంచరిస్తున్న దుర్గుణాల్ని వాడి వర్తన బట్టబయలుచేసి నా కళ్లు విప్పింది.

ప్రకా—మీ మాటలు నాకు బాగా అర్థంకావటంలేదు. కాని సుందరంమటుకు మహా బాధపడుతూ వుండేవాడు...మాధురివిషయం మరీ ఆశ్చర్యంగా వుంది. వేశ్యల్లో అంత ఆత్మోన్నత్యం ఉంటుందని నే నెప్పుడూ ఊహించలేదు...అంత ఔన్నత్యంఉంది కనకే నేమోకూడాను మాధురి అంటే అతని కంత ఆకర్షణ! ఆమెకి మీ మీద గల ప్రేమ, గౌరవం అసాధారణం.

ప్రసా—నే నామెకి ఋణగ్రస్తుణ్ని. ఆమె వర్తన నన్ను గాద్గదికుణ్ని చేస్తుంది.

ప్రకా—అంత విశాలహృదయం గల మనిషి అలాంటి నీచమైన జీవితం ఎందుకవలంబించిందోగదా అని ఆశ్చర్యం వేస్తుంది.

ప్రసా—దానికీ నేనే కారణం డాక్టరుగారూ! నేను నీతివంతుడిగా ప్రవర్తించాననుకున్నాను ఆమెని తిరస్కరించి. కనీసం సానుభూతితో చూడనన్నా చూడమని ప్రార్థించింది...కాని నాలోని పశువాంఛ ఎక్కడ బలీయమైపోతుందో అనే భయంతో పిరికిపందనై, ఆమెమొహం చూడటమే మానేశా...అయినా లోకాపవాదు తప్పలేదు.

ప్రకా—సుందరం చెబుతూవుండేవాడు మీ మీది పుకారు విషయం...ఇదే అయుంటుంది.

ప్రసా—అవును. ఆ అపవాదు నన్ను మరీ భీరుణ్ని చేసింది. ఆమెని వీరవనితని చేసింది కూడా ఆ లోకాపవాదే. స్ఫటికంలాంటి మనిషిని అగ్నిలోకి తోసేసింది సంఘం...నిజానికి నీతివంతు లక్కర్లేదు యీ పాడు సంఘానికి...సంఘంమీది ద్వేషంతో తన మానాన్నే బలియిచ్చింది మాధురి. పతనం పొందేదాకా అపవాదులతో తరిమి తరిమి, పతనం పొందిన తరవాత ధనరాసులు కుమ్మరించారు...ఆమె ఎదటే! కోటీశ్వరు లామెముందు మోకరిల్లారు.

ప్రకా—మీరు చెప్పేది కట్టుకథల్లే కనిపిస్తోంది, నిజమైనా కూడాను.

ప్రసా—(గంభీరంగా) ఆ మానత్యాగాని కామె సునిశిత హృదయం ఎంత వ్యథ పొందిందో నేను మాత్రమే ఊహించి బాధపడగలను డాక్టరుగారూ. ప్రకృతి ప్రసాదించిన సౌందర్యం, నేను బోధించిన సంగీత సాహిత్యాలూ ఆమె మిగిలిన జీవితానికి యితోధికంగా దోహదమిచ్చాయి. నాకు తెలుసు. లోకులు కూసే కాకికూతలికి వెరవకుండా నే నామెని సానుభూతితో చూసేవుంటే మాధురి వేశ్యావృత్తి అవలంబించేదే కాదు. నీచమైన స్వార్థానికి లోనై నాశీలాన్ని కాపాడుకున్నాననే మిథ్యాతృప్తికోసం ఆమెనిర్మల జీవితాన్ని విషాగ్నుల్లోకి ఉరికించిన నేను నీతివంతుడినేనా?

ప్రకా—మీ అన్నదమ్ము లదో 'తమాషా మనుష్యులు'. సుందరానికి నేను సమాధానం చెప్పలేకపోయా మాధురి విషయంలో ... ఇంతకీ ఎల్లుండే కామాలు వాయిదా...మీ మనస్సు తెలుసుకుంటే సుందరం ఎంత శాంతి పొందుతాడు! వస్తా, రోగుల్ని చూసే టైం అయింది.

ప్రసా—చిత్తం...ఉంటా.

## ఎనిమిదో రంగం

(సుందరం న్యాయాధిపతికి ఎదురుగా నిలబడి వుంటాడు. రెండు వేపులా యిద్దరు సాయుధభటులు కాపలా వుంటారు.)

ప్రభుత్వన్యాయవాది— ప్రసాద రావుగారూ, మీకూ ముద్దాయికీ ఎంతకాలంనుంచి విరోధం ?

ప్రసాద—అసలు విరోధమే లేదు...

ప్ర.న్యా—'యువరానర్'...సాక్షివాలకం గమనించాలి...(సాక్షితో) అయితే ముద్దాయీ, మీరూ జాయింటుకుటుంబంలో ఉండగా, మీతో పోట్లాడి ముద్దాయి వెళ్లిపోలేదా ?

ప్రసా—వెళ్లిపోయాడు...కానిపోట్లాడికాదు.

ప్ర.న్యా—ముద్దాయి దుర్వ్యసనాలికి లోనై, యింట్లో తన భాగాన్ని కులం కానివాళ్లకు అమ్మినప్పుడు మీరు వ్యతిరేకించలేదా ?

ప్రసా—అవును. ఇంట్లో మా అమ్మగార్ని ఒప్పించే శక్తి లేక అసమర్థుడినై ఆ అమ్మకానికి మొదట్లో వ్యతిరేకించినమాట నిజమే...తరవాత నా తప్పు తెలిసింది.

ప్ర.న్యా—ముద్దాయిభార్యా, కూతురూ ఎక్కడుంటున్నారు ?

ప్రసా—నా దగ్గిరే.

ప్ర.న్యా—అలా వుండటం ముద్దాయికి యిష్టం లేదనే సంగతి మీరు గ్రహించారా ?

ప్రసా—అలా అనుకుంటానికేమీ అవకాశం లేదు.

ప్ర.న్యా—'యువర్ ఆనర్'...మాధురి స్టేటుమెంటులో ముద్దాయి యీ విషయమై చాలా తీవ్రంగా మాట్లాడినట్టు చెప్పింది.

న్యాయమూర్తి—తరవాత ?

ప్ర.న్యా—చిత్తం...(సాక్షితో) మీకూ, మాధురికీ ఏమిటీ సంబంధం ?

ప్రసా—ఆమెకి నేను సంగీత సాహిత్యాలు నేర్పాను.

ప్ర.న్యా—ఆమెని మీరు ప్రేమించలేదా ?

ప్రసా—లేదు.

ప్ర.న్యా—ఆమెకీ, మీకూ దైహికమైన సంబంధం వుందని ముద్దాయి అంటూన్నట్టు మీకుకూడా తెలిసిందా ?

ప్రసా—అలాంటి అవకాశం లేదు.

ప్ర.న్యా—యువర్ ఆనర్ ... నోటుచెయ్యాల్సిన విషయం యిది.

న్యాయమూర్తి—కానీండి...

ప్ర.న్యా—చిత్తం...(సాక్షితో) మీరు బొంబాయి ఎందుకెళ్లారు ?

ప్రసా—మా తమ్ముణ్ని కలుసుకునేందుకు.

ప్ర.న్యా—ముద్దాయి విషయమై మీరు మాధురికి రాసిన ఉత్తరం ముద్దాయికి మీయెడల గల కోపాన్ని హెచ్చుజేస్తుందని మీరు ఊహించారా ?

ప్రసా— వాడికి నామీద కోపమే లేదని బాగా తెలుసును.

ప్ర.న్యా—మీరు వెళ్లే సరికి ముద్దాయి ఎక్కడున్నాడు ?

ప్రసా—మాధురి యింట్లో.

ప్ర.న్యా— ఆమెతో పెనుగులాడుతుండగా మీరు వెళ్లారుగదా, అడ్డువెళ్లటంవల్ల మీకు ప్రమాదం కలుగుతుందని గుర్తించలేదా ?

ప్రసా—ప్రమాదం కలగదని నాకు తెలుసు. నామీద చాలా గౌరవం వాడికి.

ప్ర.న్యా—మీ మీద రివాల్వరు కాల్చేసరికి ముద్దాయితో మీ రేమంటున్నారు ?

ప్రసా—నామీద కాల్చలేదు.

ప్ర.న్యా—ఎవరిమీద కాల్చాడు మరి ?

ప్రసా—గాలిలోకి.

ప్ర.న్యా—అయితే ప్రమాదవశాత్తూ మీకు తగిలిందన్నమాట ఆదెబ్బ!...

ప్రసా—కాదు. ట్రాముమీదనుంచి పడటంచేత తగిలింది ప్రమాదవశాత్తూ దెబ్బ.

ప్ర.న్యా—ముద్దాయి మిమ్మల్ని హత్యచెయ్యటానికి యింకా ఏం ప్రయత్నం చేసి పారిపోయాడు?

ప్రసా—అసలేమీ ప్రయత్నమే చెయ్యలేదు. వాడికా ఉద్దేశమే లేదు కనక.

ప్ర. న్యా— గాలిలోకి మటుకు కాల్చడమెందుకు ?

ప్రసా—మాధురిని బెదిరించి లోబరుచుకునేందుకు అయివుండవచ్చు.

ప్ర. న్యా—మీరింతకాలం ఎక్కడున్నారు ?

ప్రసా— ట్రాంమీదనుంచి పడ్డ గాయానికి చికిత్స పొందుతున్నాను.

ప్ర. న్యా — యువర్ ఆనర్ ... సాక్ష్యంవల్ల ఋజువయ్యేదేమంటే...ముద్దాయితో సాక్షి పోట్లాడి వెళ్లగొట్టాడు. ముద్దాయి భార్య, పిల్ల సాక్షిదగ్గర వుండటం ముద్దాయికి చాలా అవమానకరంగా వున్నట్లు మాధురిస్టేటుమెంటువల్ల తెలుస్తోంది. సాక్షి ఆ విషయమై సరిగ్గా సమాధానం చెప్పకపోవటం దాన్ని ధృవపరుస్తోంది. సాక్షికి కష్టం కలిగించటానికే యింట్లో తన భాగం కులంకానివాళ్లకి అమ్మాడు ముద్దాయి. ఆ అమ్మకానికి తాను వ్యతిరేకించినట్లు సాక్షే ఒప్పుకున్నాడు. మాధురికీ, సాక్షికీ ఉన్న సంబంధం విషయమై ముద్దాయి వెలిబుచ్చిన భావాలు ముద్దాయికి సాక్షిమీద గల ద్వేషాన్ని తెలియజేస్తున్నాయి. ఈ విషయమైకూడా సాక్షి సరిగా సమాధానం చెప్పకపోవటం దాన్ని ధృవపరుస్తోంది. మాధురిమీద ముద్దాయికి చాలా మోహం ఉన్నట్టు ఆమెకి ముద్దాయి ఇరవై వేలు యివ్వటానికి ఒప్పుకోటం వల్ల ఋజువవుతోంది. సాక్షిఉత్తరంమీద మాధురి ముద్దాయిని తిరస్కరించడం ముద్దాయికి సాక్షిమీద గల క్రోధాన్ని యినుమడింపజేసింది. మాధురితో ముద్దాయి పెనుగులాడుతూండగా సాక్షి అడ్డు రావడం, ముద్దాయి అమితమైన ఆగ్రహంతో సాక్షిమీద కాల్చడం స్పష్టంగా గోచరిస్తోంది. సాక్షి చచ్చిపోయాడని ముద్దాయి పారిపోతుంటే అరెస్టు చెయ్యబడ్డాడు. కాని సాక్షి కనిపించలేదు. ఇప్పుడు సాక్ష్యానికి మాత్రం ఒచ్చాడు. ముద్దాయి కాల్చిన రివాల్వరువల్లనే సాక్షికి దెబ్బ తగిలింది. ట్రాము మీద నుంచి పడటం వల్ల కాదు. కాని ముద్దాయికి శిక్ష పడకుండావుండటానికి గాను సాక్షి వెంటనే కనిపించకుండా, గాయం నయమైన తరవాత, ట్రాముమీద నుంచి పడ్డానని పన్నాగం పన్నాడని ఋజువవుతోంది. ముద్దాయి మంచి గొప్ప వంశంలో పుట్టాడు. కాని ఒట్టి జూదరి, త్రాగుబోతు, వ్యభిచారి అని స్పష్టంగా తెలుస్తోంది. అటువంటివాడు హత్యలికి తయారవటం ఆశ్చర్యకరమూ కాదు, క్షంతవ్యమూ కాదు. కనక హత్యా ప్రయత్న నేరానికి ముద్దాయికి కఠినమైన శిక్ష విధించడం చాలా అవసరం....

న్యాయమూర్తి— (తన తీర్పులో)సాక్ష్యంవల్ల ఎక్కడా, ముద్దాయికి సాక్షి యెడల ప్రబలమైన ద్వేషం ఉన్నట్టు ఋజువు కాలేదు. పైగా ఎవరిని హత్య చెయ్యటానికి ప్రయత్నించాడని ముద్దాయిమీద నేరం మోపబడిందో, ఆ వ్యక్తే అట్టి ప్రయత్నమేమీ జరగలేదని స్పష్టంగా చెబుతున్నాడు. సాక్షికి తగిలిన గాయం రివాల్వరుదెబ్బ అని డాక్టరు సర్టిఫికెట్టులో కూడా లేదు. ముద్దాయి ఆ సమయంలో బాగా తాగివున్నట్లు ప్రాసిక్యూషను వారి కథనం వల్లనూ, మాధురి స్టేటుమెంటు వల్లనూ తెలుస్తోంది. ముద్దాయి చేష్టల వల్ల గాభరా జెందిన మాధురి రివాల్వరు శబ్దం వినగానే మూర్ఛ జెందిందని సాక్ష్యం చెబుతోంది. అడ్డు ఒచ్చిన సాక్షి మీదే ముద్దాయి కాల్చివుంటాడని మూర్ఛ తేరిన తర్వాత మాధురి అనుకుని వుంటుంది... కాని మాధురిని బెదిరించి లోబరచుకుంటానికే ముద్దాయి రివాల్వరు గాలిలోకి పేల్చివుంటాడని సాక్షి చెప్పడమే సగైనది. ముద్దాయికి సాక్షి యెడల చాలా గౌరవం ఉండటంచేత తాను చేస్తున్న పనికి సిగ్గుపడి, సాక్షిని చూడగానే ముద్దాయి వెళ్లిపోతుంటే అరెస్టు చేయబడ్డాడు.... సాక్షి మంచి హోదాలో వున్న గౌరవం గల పెద్దమనిషి. ఆయనసాక్ష్యాన్ని పూర్తిగా విశ్వసించి ముద్దాయిని విడుదల చేస్తూ తీర్పుయిస్తున్నా ......

సుందరం — (అమాంతం పరుగెత్తుకొచ్చి అన్నగారి కాళ్లమీద పడుతూ) అన్నయ్యా!...

ప్రసాదరావు — (తమ్మణ్ని లేవదీసి కావిలించుకుంటూ) తమ్ముడూ!..